అప్రయత్నంగా తన బుగ్గలమీదికి వేళ్లుపోనిచ్చి తడివి చూసుకొన్నాడు- ఎర్రమాగాణోళ్ళ పెద్దమాంవ జెప్పిన మాట నిజం. ఇప్పుడు తన బుగ్గలకు, రామసెంద్రుడు మావ బుగ్గలకు అన్నీ పోలికలే.

పొద్దు తిరిగిందాకా అరకదున్నాడు గాని గోపన్నకు ఆకలి వేయలేదు. పంట కాలువ ఒడ్డునుండి సద్దిమూట నీళ్ళలో పడి ఎర్రరేగటితోపాటు కొట్టుకుపోయింది.

## 3

పెద్దరెడ్డిగారింట్లో గోపన్న కమతానికి కుదిరినప్పట్నించీ పెళ్ళి సంబంధాలూ, మనువు మాటలూ ఎక్కువయినై. వెనక పెదిమ విరిచిన ఆరిగ లచ్చన్న, "సోమరిదున్న" అని తిట్టిన తరిణె పెబంధం (పరంధామయ్య), ఎకరా రొండు కుంచలు సంపాదించిన ముత్తాల నారయ్య, "పెద్దమడుసుల్లో" జమయిన సినరామసెంద్రయ్యా అంతా "మా పిల్ల నిత్తామంటే మా పిల్లనిత్తామని" ముందుకొచ్చారు. మొదట్లో గోపన్న మనస్సు పరిపరి విధాల "బెమలు"బడి, చివరకు మేనరికమే చేసుకొన్నాడు. మేనరికమంటే అప్ప చీతారాం కూతురు, హనుమాయి. తనకయితే సినరామసెంద్రుడు మామ కూతురు అదెమ్మమీదనే గురి, మొదటినుంచీ; కాని ఏమయిందో, ఏం గుబులు దిరిగిందో జ్ఞాపకం లేని వాళ్ళంతా ఏమేమి బోధలు చేశారో, ఏమోగాని - సివరకు - ''అప్పా! అనుమాయిని జేసుకుంటానే'' అన్నాడు.

హనుమాయి సన్నగా వుంటుంది నల్లగా నిగనిగలాడే పిల్ల. సురుకంటే సురుకు. సిసింద్రీ—

* * *

పెల్లికని ఖర్చున బడాల్సొచ్చింది గోపన్న- తోడి కమత గాళ్ళందరూ వుడికించినందుకేమో.

"అరేయ్, పెద్దరెడ్డిగారికి పరువుబోద్దిరా. నీ తలకాయ! పట్టుపంచె లేని పెల్లేం పెల్లిరా?'' అని భద్రయ్య.

''మీ అప్ప అంటున్నదిరా, నాకేం దెలుసు? తులం బంగారం, పట్టుకోక కట్టబెడతానన్నావంటగా?'' అని పేరమ్మగారి కమతగోడు ఈద్వరయ్య.

ఆ కళ్ళలో నీళ్ళు, ఆ గుండెలో బరువు, ఆ ఆత్మలో అగ్ని కొత్త రూపాలను, కొత్త సత్యాలను కొత్త లోకాలను చూపెట్టినాయ్.

గోపన్న తిరిగి ఊళ్ళో కనిపించలేదు.

## 10

"అరే, ఈచ్వరా! మన గోపు గోసాయాళ్ళలో గలిశాడంటార్రా జనం" అని ఎర్రమాగాణోళ్ళ చినరా సెంద్రయ్య, పేరమ్మగారి కమతగోణ్ణి, ఈచ్వరయ్యను సంవత్సరమైనాక ప్రశ్నించాడు.

"ఏవోఁనే సిన్నయ్యా! అడి మనుసు అంత మెత్తందే."

"మా అదినిచ్చి తిరిగి పెళ్లిజేద్దావఁని గాదంట్రా మనమంతా అనుకొంది?"

"భెమ్మంగారి మటంలో గనబడ్డాడంట శాయమ్మగోరికి చావణమాసంలో! అడికింకేం పెళ్లే సిన్నయ్యా?"

*

(ఆంధ్రపత్రిక - సచిత్రవార పత్రిక - 27 ఆగస్ట్' 52)